క్లుప్తంగా

డ్రైనేజీ పనులకు నిధుల ప్రొసీడింగ్ అందజేత


నిధుల ప్రొసీడింగ్ అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: గ్రామాభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని 6వ వార్డు, 10వ వార్డుల్లో నిర్మించే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి రూ.2లక్షల మండల పరిషత్ నిధులను మంజూరు చేశారు. దీనికి సంబంధించి ప్రొసీడింగ్‌ను వార్డుసభ్యులకు అందజేశారు. వార్డు సభ్యులు ఎట్టమ్మ, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యా నాయక్, నాయకులు వెంకటయ్య, చంద్రశేఖర్, నాగార్జున, రాజేశ్, రమేశ్, భానుకిరణ్, జంగమ్మ, అలివేలు, లక్ష్మమ్మ, యాదమ్మ, ఆండాలు ఉన్నారు.

సమ్మెకు సహకరించండి


వినతిపత్రం అందజేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

యాచారం: ఉద్యోగాల క్రమబద్ధీకరణే లక్ష్యంగా ఈ నెల 28 నుంచి సమ్మెకు వెళ్తున్నాం.. సహకరించాలని యాచారం మండలంలో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు గురువారం ఎంపీడీఓ విజయలక్ష్మికి, యాచారం పోలీసులకు వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు యాచారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట శాంతియుత నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆమనగల్లు: మాడ్గుల మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో గురువారం ఎంపీడీఓ రాఘవులు ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ పంచాయతీ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఇబ్రహీంపట్నం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి వచ్చిన డా.సరిత, ఉపమలేరియా అధికారి హేమ్‌లాల్ సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో సీపీఆర్ ఏ విధంగా చేయాలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వేజన్న, గ్రామ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం


తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్‌ఎస్ శ్రేణుల సంబురాలు

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం గ్రామాల్లో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. దండుమైలారం గ్రామంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి బీఆర్‌ఎస్ పార్టీ జెండాను ఎగురవేశారు. అదేవిధంగా రాయపోల్ గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు.

వీఓఏలను సీసీలుగా గుర్తించండి


మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న వీఓఏలు

తలకొండపల్లి: సమస్యల సాధనకై వీఓఏలు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె గురువారానికి 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీఓఏలు మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. నెలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, అర్హులైన వీఓఏలను సీసీలుగా గుర్తించాలని, ఆన్‌లైన్ పనిభారాన్ని తగ్గించాలని, రూ.10 లక్షల ఆరోగ్యబీమా సౌకర్యం కల్పించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు బాలకిష్టయ్య, కురుమయ్య, నర్సింహ, కల్పన, అరుణ, కృష్ణారెడ్డి, శ్రీవాణి, అనిత, మానస, యాదమ్మ, రాణి పాల్గొన్నారు.


ఆమనగల్లు: చిన్నారులకు ప్రతిభా కార్డులు అందిస్తున్న సిబ్బంది


హయత్‌నగర్: గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్న కౌన్సిలర్ అర్చన

అంగన్‌వాడీల్లో పూర్వ ప్రాథమిక విద్య

ఐసీడీఎస్ సీడీపీఓ సక్కుబాయి

ఆమనగల్లు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఆటాపాటల ద్వారా విద్య అందించడంతో పాటు వారికి అవసరమైన పోషకాహారం ఇస్తున్నట్లు ఐసీడీఎస్ ఆమనగల్లు ప్రాజెక్టు సీడీపీఓ సక్కుబాయి, కొల్కులపల్లి సర్పంచ్ బట్టు అనురాధ తెలిపారు. మాడ్గుల మండలం కొల్కులపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ–2 కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త వెంకటమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో వార్షికోత్సవ వేడుకలను నిర్వహించి పూర్వ ప్రాథమిక విద్య అభ్యసించిన చిన్నారులకు సీడీపీఓ సక్కుబాయి, సర్పంచ్ అనురాధ కార్డులు అందించారు. ప్రైవేటు పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ తరహాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య అందిస్తున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఉచితంగా పోషకాహారం అందిస్తున్నామని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బట్టు కిషన్‌రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

హయత్‌నగర్: అంగన్‌వాడీల్లో శిశువులకు, గర్భిణులకు పౌష్టికాహారం ఇస్తున్నామని పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ 15వ వార్డు కౌన్సిలర్ అర్చన అన్నారు. గురువారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అంగన్‌వాడీల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ప్రైవేట్ వెంచర్


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతల డిమాండ్

కడ్తాల్: మండల పరిధిలోని కర్కల్‌పహాడ్ గ్రామ శివారు, గోవిందాయిపల్లి తండా గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 52లో గల ప్రభుత్వ, అసైండ్, బంజరు భూములను ఆక్రమించిన వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని మండల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన ఓ రియల్ వ్యాపారికి 50 ఎకరాల భూమిని అధికారులతో కుమ్మక్కై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. ప్రస్తుతం అట్టి భూములను వెంచర్‌గా ఏర్పాటు చేశారని భూమిని చదును చేశారని అన్నారు. ఆక్రమణదారుడి నుంచి భూమిని రక్షించాలని కోరారు. ప్రభుత్వ అసైండ్ భూమికి డీటీసీపీ నుంచి ఎటువంటి అనుమతులు ఇవ్వకూడదని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తి పేరు మీద ఉన్న అసైండ్ భూములను రద్దుచేయాలని తిరిగి గిరిజనుల భూములు గిరిజనులకు ఇప్పించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాన్య నాయక్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు భగీరథ్, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి వీరయ్య, నాయకులు రవీందర్‌రెడ్డి, సాయిలాల్, డాక్టర్ రమేశ్‌అయ్యగార్, సాయిలు, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి

కార్యకర్తలకు ప్రజాప్రతినిధుల పిలుపు

మంచాల: గ్రామీణ ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ అన్నారు. గురువారం మంచాల మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు వనపర్తి భద్రీనాథ్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ యువతకు, మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తింపు ఇస్తామన్నారు. మే 9వ తేదీన ఇబ్రహీంపట్నం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే యువ సమ్మేళన కార్యక్రమాని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం నాయకుడు శేఖర్, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ జానీపాష, యువజన విభాగం మండల ప్రధాన కార్యదర్శి విజయ్, బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ నాయక్, యువజన విభాగం మండల ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, నాయకులు ప్రకాశ్‌రెడ్డి, యాదగిరి గౌడ్, విజయ్, శ్రీకాంత్, సాయికుమార్, నాగరాజు, విష్ణు, ప్రశాంత్, చెన్నకేశవ, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు స్వర్ణామృత ప్రాసన చుక్కలు


పిల్లలకు స్వర్ణామృత ప్రాసన చుక్కలు వేస్తున్న ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి

మీర్‌పేట: మీర్‌పేట వికాస తరంగిణి ఆధ్వర్యంలో గురువారం జిల్లెలగూడలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో, సిల్వర్‌డ్రాప్స్ స్కూల్‌లో స్వర్ణామృత ప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ బీ రాజేందర్‌రెడ్డి, ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై 16 సంవత్సరాలలోపు పిల్లలకు చుక్కలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వర్ణామృత ప్రాసన చుక్కలు వేయడం ద్వారా పిల్లల్లో రోగ నిరోధక శక్తి, మేధాశక్తి పెరుగుతుందని తెలిపారు. అదే విధంగా శారీరక రుగ్మతలు తొలగిపోతాయన్నారు. సుమారు 330 మంది పిల్లలకు చుక్కలు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వికాస తరంగిణి జోనల్ బాధ్యులు అహల్య, సభ్యులు రూపవతి, ఉష, ప్రసన్న, మాలతి, సువర్ణ, రవీందర్‌రెడ్డి, రఘువీర్, ఉమా, రాధిక, వేముల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనగర్‌లో అధికారుల పర్యటన


కాలనీవాసులతో మాట్లాడుతున్న అధికారులు

హుడాకాంప్లెక్స్: పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రాం విత్ కాలనీ అసోసియేషన్ కార్యక్రమంలో భాగంగా గురువారం జీహెచ్‌ఎంసీ అధికారులు లక్ష్మీనగర్ కాలనీలో పర్యటించారు. కాలనీలోని బీటీ రోడ్డును విస్తరించాలని, శానిటేషన్ పనులు చేయాలని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. కృతుంగ హోటల్ నుంచి బేకర్స్ క్యూ వరకు డ్రైనేజీ లైన్ పెంచాలని విన్నవించారు. దెబ్బతిన్న అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. కాలనీలో పార్కును అభివృద్ధి చేయడంతో పాటు మహిళా భవనం నిర్మించాలని కాలనీవాసులు అధికారులను కోరారు. ప్రజల విన్నపాలను మంత్రి సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎల్ కొండల్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులు పూజ, శివ, సురేష్, సతీష్, శంకర్, పోలీసు శాఖ నుంచి మహా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలి: ఎన్‌ఎస్‌యూఐ

కడ్తాల్: టీఎస్‌పీఎస్‌సీ బోర్డును ప్రక్షాళన చేయాలని ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్ ఆధ్వర్యంలో గురువారం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాసి పంపారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్ మాట్లాడుతూ.. లీకేజీ ఘటనలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని.. నిందితులను కఠినంగా శిక్షించాలని.. టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం చేయలేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు అజ్గర్‌అలీ, క్యామ రాజేశ్, ఇమ్రాన్‌బాబా, వంశీ, సత్యం, పవన్, గణేశ్, ప్రవీన్ ఉన్నారు.

ఆమనగల్లు పట్టణంలో..

ఆమనగల్లు: టీఎస్‌పీఎస్‌సీ బోర్డును ప్రక్షాళన చేయాలని ఆమనగల్లు మండల ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు ఎండీ ఫరీద్ డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలని కోరుతూ రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో రిజిస్టర్ పోస్టు చేశారు. ఉద్యోగ నియామక ప్రక్రియలో అవకతవకలకు పాల్పడుతూ నిరుద్యోగుల పాలిట యమపాశంగా మారిన బోర్డును ప్రక్షాళన చేయాలని.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు ఆబిద్, శివ, ఈశ్వర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని చరికొండ గ్రామానికి చెందిన నీలాల మంగ గురువారం మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని స్థానిక ఎంపీటీసీ అద్దాల రాములుగౌడ్ పరామర్శించారు. ఆమె కుటుంబానికి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. పరామర్శించిన వారిలో యాదయ్య, వెంకటయ్య, హరిచందర్, మహేందర్, నర్సింహ, కృష్ణ ఉన్నారు.

'తెలంగాణ భరోసా' వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

ఆమనగల్లు: మాడ్గుల మండల కేంద్రంలో గురువారం బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మే 7న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే తెలంగాణ భరోస సభ పోస్టర్లను బీఎస్పీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ భరోసా సభకు ముఖ్య అతిథిగా బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి హాజరవుతున్నారని చెప్పారు. సభకు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు మహేష్, సంజీవ్, రాజు, భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలి


డ్వాక్రా సభ్యులతో మేనేజర్ రమేష్

మహేశ్వరం: డ్వాక్రా మహిళలు బ్యాంకుల్లో రుణాలు తీసుకొని సకాలంలో చెల్లిస్తూ ఆర్థిక ప్రగతికి పునాదులు వేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మహేశ్వరం బ్రాంచ్ మేనేజర్ రమేష్ సూచించారు. నాబార్డు సహకారంతోనే సొసైటీ ఫర్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ ఫ్యాషన్ డిజైన్ కోర్సు శిక్షణ శిబిరంలో 12వ రోజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డ్వాక్రా సంఘాలు లోన్లు ఎలా తీసుకోవాలి, ఎలా కట్టుకోవాలి పొదుపు చేసుకునే మార్గాలను ఆయన వివరించారు. సొసైటీ ఫర్ ఎకనామికల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర అధ్యక్షురాలు క్రాంతి, సొసైటీ అడ్మినిస్ట్రేషన్ విష్ణువర్ధన్‌రెడి పాల్గొన్నారు.

ఉప్పరాశి కుంటను ఆక్రమిస్తే చర్యలు

సర్వేను ప్రారంభించిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు


ఉప్పరాశి కుంటను పరిశీలిస్తున్న అధికారులు

కడ్తాల్: మండల కేంద్రంలోని ఉప్పరాశి కుంట చెరువు సర్వేను ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు గురువారం ప్రారంభించారు. ఉప్పరాశి కుంట శిఖం భూములు ఆక్రమణలకు గురవుతున్నట్లు పలుమార్లు మండల, గ్రామసభల్లో ప్రజాప్రతినిధులు, స్థానికులు ఆందోళన చేపట్టడంతో పాటు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఉప్పరాశికుంట సర్వేకు రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి అధికారులు చెరువును పరిశీలించారు. రికార్డుల ప్రకారం చెరువుకు సర్వే నిర్వహించి హద్దు రాళ్లు పాతుతామని, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను నిర్ధారించి ఆక్రమణలకు పాల్పడితే చర్యలు చేపడుతామని తెలిపారు. రెండు రోజుల పాటు సర్వే నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆక్రమణదారులపై చర్యలు తప్పవన్నారు. తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, మైనర్ ఇరిగేషన్ శాఖ ఏఈ నిఖిల, సర్వేయర్ పాండురంగారెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, స్థానిక నాయకులు భాస్కర్‌రెడ్డి, హన్మానాయక్, చందోజీ, రాఘవేందర్, లక్ష్మయ్య, రాఘవేందర్, సుధాకర్‌గౌడ్, కృష్ణ, శేఖర్, రమేశ్ తదితరులు ఉన్నారు.

ఉపాధిలో 200 పనిదినాలు కల్పించండి


కూలీల సమస్యలు తెలుసుకుంటున్న అంజయ్య

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య

యాచారం: ఉపాధి కూలీలకు ఏడాదిలో 200 రోజుల పనిదినాలు కల్పించాలని.. అలాగే చేసినపనికి వారం, వారం వేతనాలు సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని నస్దిక్‌సింగారం గ్రామంలో గురువారం పర్యటించిన ఆయన ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయాలని చూస్తోందని మండిపడ్డారు. బడ్జెట్‌లో నిధులను తగ్గించడంతో పాటు పలు నిబంధనలు పెట్టిందని అన్నారు. కేంద్రం పెట్టే నిబంధనల వల్ల కూలీలు ఉపాధి పనులు చేయడానికి ఆసక్తి చూపడం లేదని అన్నారు. చేసే పనులకు నెలలు గడుస్తున్న వేతనాలు రాకపోవడంతో కూలీలు పస్తులుండాల్సిన దుస్థితి వస్తుందని అన్నారు. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా, ఆందోళనలు, ధర్నాలు చేసిన పట్టించుకునే వారే లేరని మండిపడ్డారు. కూలీల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సంజీవ, గోపాల్, చెన్నరెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి 43 యూనిట్లు

గొర్రెల పంపిణీపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అగ్నివేశు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకట్రావ్‌పేట్‌లో గురువారం రెండో విడత గొర్రెల పంపిణీపై కురుమ యాదవ సోదరులకు పశువైద్యాధికారి డాక్టర అగ్నివేశు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా గ్రామానికి 43 యూనిట్లు కేటాయించినట్లు తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి ఒక గొర్రె పొటేల్, 20 గొర్రెలు పంపిణీ చేయబడునని చెప్పారు. ప్రతి లబ్ధిదారుడు తమ అకౌంట్‌లో రూ.43,750 తప్పనిసరిగా జమ చేయాలని పేర్కొన్నారు. అకౌంట్‌లో డబ్బులు జమచేసిన వారికే గొర్రెలు ఇవ్వబడునని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడు.. కులం, ఆధార్, సర్టిఫికెట్‌లతో పాటు, బ్యాంక్ పాస్‌బుక్కును కలిగి ఉండి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీరప్ప గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి పాండురంగయ్య, సభ్యులు శివశంకర్, మహేష్, శ్రీనివాస్, లింగం, రాములు, వెంకటయ్య, ఐలయ్య, శ్రీశైలం, ఆంజనేయులు, దశరథం, హుస్సేన్, సాయిలు, పెంటయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేద్దాం


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

డీఎస్‌పీ మండల కన్వీనర్ ఆనంద్

మంచాల: దళిత శక్తి ప్రోగ్రాం(డీఎస్పీ) ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్వరాజ్య పాదయాత్ర ముగింపు సందర్భంగా ఏప్రిల్ 30న నగరంలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని డీఎస్పీ మండల కన్వీనర్ ఆనంద్ అన్నారు. మంచాల మండల కేంద్రంలో గురువారం బహిరంగసభకు సంబంధించిన వాల్‌పోస్టర్ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాలకు రాజ్యాధికారం దక్కాలనేదే విశారదన్ మహరాజ్ లక్ష్యమన్నారు. స్వరాజ్య స్థాపన కోసం 10వేల కిలో మీటర్లు పాదయాత్ర చేసి హైదరాబాద్‌కు వస్తున్నట్లు తెలిపారు. 30న నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం నాయకులు ప్రదీప్, శ్రవణ్, వినోద్, రంజిత్, లింగస్వామి, శివ తదితరులు పాల్గొన్నారు.

సీతారాంచంద్రస్వామి ఆలయ కమిటీ ఎన్నిక


ఆలయ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

యాచారం: నల్లవెల్లి శ్రీ బొగ్గులగట్టు సీతారాంచంద్రస్వామి దేవాలయ కమిటీ చైర్మన్‌గా గండికోట యాదయ్య నియమితులయ్యారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సూచన మేరకు గురువారం రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా గండికోట యాదయ్యతో పాటు సభ్యులుగా శోభరాములు, మోహన్, యాదయ్య, సత్యనారాయణను నియమించారు. ఈ మేరకు గురువారం ఆలయం ఎదుట దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఈఓ ప్రవీణ్‌కుమార్ చైర్మన్‌తో పాటు సభ్యులచేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆలయంలో ఉన్న సీతారాచంద్రస్వామి దంపతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లవెల్లి ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీపతిగౌడ్, యాదయ్యగౌడ్, పాలకూర్ల లక్ష్మీపతిగౌడ్, కాసాని రవిగౌడ్, ఐలయ్య, కానమోని జంగయ్య, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనకు చరమగీతం పాడుదాం

సీపీఐ రాష్ట్ర నాయకుడు నర్సింహ


నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మంచాల: అవినీతి పాలనకు చరమగీతం పాడాలంటే కేంద్రంలో బీజేపీని ఓడించాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు కావలి నర్సింహ అన్నారు. గురువారం మంచాల మండల పరిధిలోని దాద్‌పల్లి, చీదేడ్, కొర్రం తండా, బోడకొండ, సత్తి తండా, లోయపల్లి, చెన్నారెడ్డిగూడ, ఆరుట్ల గ్రామాల్లో సీపీఐ ప్రజా పోరు యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ సర్కార్ కార్పొరేట్ శక్తులకు రెడ్ కార్పెట్ పరుస్తూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు తీరని అన్యాయం చేస్తోందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచేయడంతో మార్కెట్‌లో ఏమి కొనుగోలు చేయలేని పరిస్థితి దాపురించిందన్నారు. సామాన్య పేద ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతుందని తెలిపారు. ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నీలమ్మ, జిల్లా నాయకులు లక్ష్మయ్య, నర్ల శ్రీశైలం, కృష్ణ, విజయ్‌కుమార్, నర్సింహ, కిషన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.